సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 26 । జనవరి । 2024



గ్రీన్ సిటీగా విశాఖ

విశాఖ నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ఐఎఫ్‌సీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు జీవీఎంసీ కమిషనర్ తెలిపారు. IIలో



ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. IIలో



వెయ్.. చిందెయ్..

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని బాస్కెట్ బాల్ మైదానంలో గురువారం సందడి నెలకొంది. IIలో

న్యూస్‌రీల్

రేపు సీఎం జగన్ రాక



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న నగరానికి రానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.20 గంటలకు బయలుదేరి భీమిలి నియోజకవర్గం సంగివలస దరి ఎన్‌ఆర్‌ఐ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన సంగివలస వద్ద ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల బహిరంగ సభ సభాస్థలికి చేరుకుంటారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.35 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

29 నుంచి త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ బృందం

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాభారతి వేదికగా ఆరు రోజుల పాటు త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 348 కచేరీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతిరోజూ రాత్రి ప్రసాదం వితరణ ఉంటుందన్నారు. వయోలిన్‌పై 24 మంది, మృదంగంపై 36, తబలపై ఒకరు సహకరిస్తారని వివరించారు.

కొనసాగుతున్న జల్ ప్రహార్ విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న భారత నేవీ సిబ్బంది

సింధియా: భారత నావికాదళానికి సంబంధించి ద్వివార్షిక ఉమ్మడి వ్యాయామం జల్ ప్రహార్ విశాఖ తీరంలో కొనసాగుతోంది. ఈ నెల 22న ఈ కార్యక్రమం ప్రారంభం కాగా.. గురువారం వరకు విశాఖ హార్బర్‌లో జరుగుతుంది. ఈ నె 27 నుంచి 31వ తేదీ వరకు సముద్రంలో విన్యాసాలు నిర్వహిస్తారు.

రేంజ్ నుంచి సిటీకి నలుగురు సీఐలు

విశాఖ సిటీ: విశాఖ రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న నలుగురు ఇన్‌స్పెక్టర్లు విశాఖ నగరానికి వచ్చారు. అలాగే విశాఖ రేంజ్ నుంచి ఒకరిని శ్రీకాకుళం జిల్లాకు పంపించారు. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న వి.శ్రీనివాసరావు, టి.కల్యాణ్, ఆర్.అప్పలనాయుడు, జి.దాలిబాబులను విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే రేంజ్ వీఆర్‌లో ఉన్న జి.దివాకర్ వాయునందన్ యాదవ్‌ను శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస సర్కిల్‌కు బదిలీ చేశారు.

4,074 మందికి వైద్య సేవలు



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం పిఠాపురంకాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, ఎన్‌జీజీవో కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట, నరసింహనగర్, లంకెలపాలెం, గాజువాక, బుచ్చిరాజుపాలెంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వైద్య శిబిరాలను సందర్శించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 4,074 మంది వైద్య సేవలందించగా.. 18 కేసులను వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

మహారాణిపేట, విశాఖ సిటీ: పోలీసు బ్యారెక్స్ మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారు. స్వాతంత్ర్య సమరయోధులు, పద్మ పురస్కార గ్రహీతలు, అర్జున పురస్కార గ్రహీతలు, ముఖ్య వ్యక్తుల పరిచయ కార్యక్రమం జరుగుతుంది. దేశభక్తిని చాటుతూ సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రగతిని తెలుపుతూ తొమ్మిది ప్రభుత్వ శకటాల ప్రదర్శన ఉంటుంది. అనంతరం 500 మందికి ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందజేస్తారు. పలు సంక్షేమ శాఖలకు చెందిన రూ.45 కోట్ల విలువ చేసే ఆస్తులను పేద ప్రజలకు పంపిణీ చేస్తారు. 12 ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కోతకు పూత



డ్రెడ్జింగ్ పనులు ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, డీసీఐ సీఎండీ దివాకర్



సంద్రం.. తీరం.. రెండూ ఒకే జంట. తరతరాలుగా చూస్తున్నా తరగని కనులపంట. కెరటంతో ఆటలాడి.. నురగల నవ్వుల వెల్లువలో జలకాలాడి మురిసిపోతుంది తీరం. బంగారు వర్ణంలో మెరిసిపోయే ఇసుక రేణువులను ఒళ్లంతా పులుముకుని.. అలల మువ్వల్ని కాళ్లకు కట్టి కొత్తకొత్త నాట్యరీతులను ఆవిష్కరిస్తుంది సంద్రం. అందుకే వాటిది అవినాభావ సంబంధం. ఆ ఉరికే కెరటమే తీరం మీదకు కత్తి దూయడం.. నిత్యం శాయశక్తులా వేటు వేయడమే ప్రకృతి చిత్రం. దూసుకొచ్చే అల కారణంగా కడలి ఒడ్డు కోతకు గురవుతున్న సంగతి కళ్లెదుట కనిపించే వాస్తవం. ఈ కోత పరాకాష్టకు చేరుతూ ఉండడంతో బీచ్ సహజ స్వరూపాన్ని పోగొట్టుకుంటోంది. తీరంలో తీవ్రనష్టం జరుగుతోంది. అందుకే కోత గాయానికి పైపూత వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోంది విశాఖ పోర్టు. ఈ రంగంలో అపార నైపుణ్యం గల డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సాయంతో ఈ ఏడాది కూడా రూ.19.09 కోట్లతో భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, డీసీఐ సీఎండీ దివాకర్ గురువారం ఈ పనులకు శ్రీకారం చుట్టారు. – సాక్షి, విశాఖపట్నం

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.19.09 కోట్లతో బీచ్ డ్రెడ్జింగ్
- సీఎస్సార్‌లో భాగంగా పనులకు శ్రీకారం చుట్టిన విశాఖ పోర్టు
- మూడేళ్లకు రూ.57.26 కోట్లతో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో ఒప్పందం
- ఏడాదికి 2.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకని తోడేలా చర్యలు

కనువిందుగా కనిపిస్తూ.. సోయగాలకు ప్రతిరూపంలా ఉండే సముద్ర తీరం.. ఇంత అందానికి కారణమైన కడలి కారణంగానే కోతకు గురవుతోంది. విశాఖ తీరంలో ఇసుక కోతకు సంబంధించి తొమ్మిదేళ్ల కిందట నెదర్లాండ్స్‌కి చెందిన డెల్టారిస్ అనే సంస్థ సర్వే చేసింది. అలల తాకిడి కారణంగా పెద్ద మొత్తంలో ఇసుక సముద్రంలోకి వెళ్లిపోతోందని గుర్తించింది. ఈ సమస్యకు ఇసుక మేటలను తిరిగి తీరానికి తరలించడం ఒక్కటే పరిష్కారమని సూచించింది. తీరం కోతకు గురవుతున్న విషయంపై ఆందోళన వ్యక్తం చేసిన విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) దాని నివారణ బాధ్యతను తన భుజానికెత్తుకుంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) జరిగిన నేపథ్యంలో 2016లో కోత నివారణకు ఆఘమేఘాలపై ఏర్పాట్లు చేసింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహాయంతో 4.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీరానికి తీసుకొచ్చి.. కోత నివారణకు చర్యలు తీసుకుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏటా ఇదే తరహాలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఇసుకను తీరానికి తీసుకొచ్చే ప్రక్రియను పూర్తి చేస్తోంది.

ఏటా 2.1 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యం

ఏటా మాదిరిగానే.. ఈ సారి డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఏటా డ్రెడ్జింగ్ నిర్వహణకు రూ.6కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు ఖర్చు చేసిన వీపీఏ.. ఈసారి ఏకంగా రూ.19.09 కోట్లు ఖర్చు చేస్తోంది. వచ్చే మూడేళ్లకు గానూ రూ.57.26 కోట్లతో డీసీఐతో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ పనులను పోర్టు నిర్వహిస్తోంది. ఏటా 2.1 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున మొత్తం 6.3 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను డీసీఐ డ్రెడ్జ్–21 ద్వారా తోడనున్నారు.

30 రోజుల పాటు డ్రెడ్జింగ్

బీచ్‌లను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. 1976 నుంచి విశాఖ పోర్టు అథారిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఇసుక కోత నివారణ చర్యలను నిర్వర్తిస్తోంది. సుమారు 3 నుంచి 4 కిలోమీటర్ల మధ్య తీరంలో ఇసుక కోతకు గురవుతోంది. మూడేళ్ల పాటు డ్రెడ్జింగ్ నిర్వహించేందుకు డీసీఐఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ఏడాది 30 రోజుల పాటు డ్రెడ్జింగ్ నిర్వహిస్తాం. సముద్ర లోపల పేరుకుపోయిన ఇసుకను తవ్వి ఆర్కే బీచ్, సబ్ మెరైన్ పరిసర ప్రాంతాలను కవర్ చేస్తున్నాం. 0.5 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్, రెయిన్ బోయింగ్ ద్వారా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నాం.

– డా.అంగముత్తు, వీపీఏ చైర్మన్

సీఎం జగన్ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాప్‌రెడ్డి

తగరపువలస: సంగివలస వద్ద ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్రకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులతో సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించి మూడు రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు గురువారం సాయంత్రం సభ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో సంగివలస హెలీప్యాడ్‌కు చేరుకున్న దగ్గర నుంచి సభా స్థలానికి చేరుకోవడం, బహిరంగ సభ తర్వాత తిరిగి హెలీప్యాడ్‌కు చేరుకోవడం వంటి అంశాల గురించి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, డీసీపీలు కంచిలి శ్రీనివాసరావు, కొండపు ఆనంద్‌రెడ్డిలతో మాట్లాడి తెలుసుకున్నారు. సభ జరిగే సమయంలో జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా వాహనాల పార్కింగ్ వంటి విషయాలపై చర్చించారు. సభా ప్రాంతాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపకశాఖాధికారి పి.సింహాచలం, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తదితరులు తమ సిబ్బందితో పరిశీలించారు. విజయనగరం జిల్లా గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సంగివలస వచ్చారు. మరొక వైపు బహిరంగ సభ జరుగుతున్న ప్రదేశంతో పాటు చుట్టుపక్కల రహదారులపై విద్యుద్దీపాలు, పెయింటింగ్ పనులు పునరుద్ధరించారు. పార్కింగ్ స్థలాలకు రాకపోకలకు సంబంధించి గ్రావెల్‌తో మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి పనులను పార్టీ రీజినల్ యూత్ కోఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, ప్రజాప్రతినిధులు దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, అక్కరమాని రామునాయుడు, దంతులూరి వాసురాజు, గాడు వెంకటప్పడు, నాయకులు అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, బోని బంగారునాయుడు, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

ఏపీఈఆర్‌సీ విచారణకు ఏర్పాట్లు

విశాఖ సర్కిల్ పరిధిలో 7 చోట్ల విచారణకు పాల్గొనే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు అమలు చేయనున్న వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై ఏపీఈఆర్‌సీ ఈ నెల 29 నుంచి 4 రోజుల పాటు విశాఖ వేదికగా బహిరంగ విచారణ నిర్వహిస్తోందని విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఏడు చోట్ల విచారణకు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ భవన్‌లోని విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఎస్ఈ ఆఫీస్, జోన్–1 ఈఈ కార్యాలయంతో పాటు కంచరపాలెంలోని జోన్–2 ఈఈ కార్యాలయం, మధురవాడలోని జోన్–3 ఈఈ కార్యాలయం, గవరపాలెంలోని అనకాపల్లి ఈఈ కార్యాలయం, కశింకోటలోని ఈఈ కార్యాలయం, పెదబొడ్డేపల్లిలోని నర్సీపట్నం ఈఈ కార్యాలయం, కొత్త పాడేరులోని పాడేరు ఈఈ కార్యాలయం నుంచి విచారణకు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మాక్ హియరింగ్ నిర్వహించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి రోజూ ఇప్పటికే ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా నమోదు చేసుకున్న వారి అభిప్రాయాలు తీసుకుంటారన్నారు. అనంతరం పేర్లు నమోదు చేసుకోని వారి నుంచి కూడా ఈఆర్సీ అనుమతితో అభిప్రాయాలు తెలియజేయవచ్చని తెలిపారు.

ఈపీడీసీఎల్ సర్కిళ్లకు అవార్డులు

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవం సందర్భంగా డిస్కమ్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సెక్షన్లు, అధికారులు, సిబ్బందికి మెరిటోరియస్ సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నామని సీఎండీ పృథ్వీతేజ ఇమ్మడి వెల్లడించారు. ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. బెస్ట్ ఆపరేషన్ సెక్షన్‌గా శ్రీకాకుళం సర్కిల్ పరిధిలోని సారవకోట, విజయనగరంలోని జామి, విశాఖలోని అనకాపల్లి డీ–2, రాజమహేంద్రవరంలోని మురమండ, ఏలూరు సర్కిల్‌లోని పెదపాడు ఎంపిక చేశామన్నారు. బెస్ట్ ఆపరేషన్ సబ్ డివిజన్‌గా నరసన్నపేట, రాజాం, నర్సీపట్నం రూరల్, కాకినాడ రూరల్, కొవ్వూరు సబ్‌డివిజన్లు, బెస్ట్ ఆపరేషన్ డివిజన్లగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి, విశాఖ జిల్లా జోన్–1 కార్యాలయం ఎంపిక చేశామని తెలిపారు. అదేవిధంగా బెస్ట్ ఈఆర్వోగా గాజువాక, ఏలూరులోని పాలకొల్లు, బెస్ట్ కన్‌స్ట్రక్షన్ డివిజన్‌గా ఏలూరుకి అవార్డులు అందజేస్తున్నామన్నారు. బెస్ట్ ఎంఅండ్‌పీ డివిజన్‌గా రాజమహేంద్రవరం, బెస్ట్ ట్రాన్స్‌ఫార్మర్స్ డివిజన్‌గా శ్రీకాకుళం, బెస్ట్ డీపీఈ డివిజన్‌గా విశాఖపట్నం, బెస్ట్ క్వాలిటీ కంట్రోల్‌గా రాజమహేంద్రవరం అవార్డులు అందుకోనున్నాయి. వీటితో పాటు వివిధ విభాగాల్లో అత్యుత్తమంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి కూడా మెరిటోరియస్ సర్టిఫికెట్స్ అందజేస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



పూజలందుకుంటున్న రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండపై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పౌష్య పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. గోవిందనామాలు స్మరిస్తూ దేవదేవుడిని దర్శించుకున్నారు. వేకువజామున నాలుగు గంటలకు ధ్వజస్తంభ పూజ జరిగింది. అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనివెట్టి మండపంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ



సీతమ్మధార తహసీల్దార్ ఆనందకుమార్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- కలెక్టర్ మల్లికార్జున పిలుపు

మహారాణిపేట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లాలో 67.8 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఈసారి శతశాతం ఓటుహక్కును వినియోగించుకునేలా కృషి చేస్తున్నామన్నారు. సంపూర్ణ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రధానమని, ఓటుహక్కు వినియోగంతోనే అది సాధ్యమన్నారు. జిల్లాలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల్లోని 1941 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 19,42,593 ఓటర్లు ఉన్నట్లు వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతను కలెక్టర్ అభినందించారు. సంపూర్ణ ఓటర్ల జాబితా ప్రక్రియలో ఉత్తమ సేవలు అందించిన ఏఈఆర్‌ఓలకు సర్టిఫికెట్‌తో పాటు రూ.10వేల పారితోషికం, ఎలక్షన్ డీటీ, బీఎల్‌వోలకు సర్టిఫికెట్‌తోపాటు రూ.5వేలు, బీఎల్‌ఓ సూపర్ వైజర్లకు సర్టిఫికెట్‌తో పాటు రూ.3వేల పారితోషికాన్ని అందించారు. తొలుత అధికారులు, యువతతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ ఓటర్లయిన 95 ఏళ్ల కె.అప్పలనరసమ్మ, 76 ఏళ్ల ఎస్.అప్పన్నలను ఘనంగా సత్కరించారు.

యువ ఓటర్లతో కలెక్టర్ ముచ్చట

ఓటర్ల దినోత్సవం సందర్భంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదైన వారితో కలెక్టర్ మల్లికార్జున ముచ్చటించారు. ఓటు హక్కు రావడం పట్ల యువత స్పందనను అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని, ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిర్భయంగా, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. తొలిసారిగా ఓటు వేయనున్న యువత కోసం ప్రతి నియోజకవర్గ పరిధిలో ఈవీఎంలను ఉంచి, అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ : ఎన్నికలకు సంబంధించిన సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నెంబరు ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ నెంబర్ ద్వారా మీ ఓటు, పోలింగ్ బూత్ వివరాలతో పాటు ఓటరు నమోదు కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెండు రోజుల్లో కలెక్టరేట్‌లో కూడా జిల్లా ఎన్నికలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి నెంబరును అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ 2014 నుంచి ఓటర్లలో జాగృతి పెరిగిందని, తద్వారా రాష్ట్ర స్థాయిలో ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చిందన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లు పూర్తి స్థాయిలో ఓటుహక్కును వినియోగించుకోవడం లేదన్నారు. ఈసారి శతశాతం ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. డీసీపీ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఓటు విలువను తెలుసుకొని ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు గురజాడ కళాక్షేత్రం నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా వరకు ఏర్పాటుచేసిన ర్యాలీలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో డి.హుస్సేన్ సాహెబ్, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన సర్వే

ఇప్పటివరకు 50 శాతం పూర్తి

సాక్షి, విశాఖపట్నం : ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూతనందించేందుకు ప్రారంభించిన సంపూర్ణ కులగణన ప్రక్రియ విశాఖపట్నం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. బడుగు, బలహీన వర్గాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న కులగణనలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిమగ్నమయ్యారు. ఈ నెల 28 వరకూ జరిగే కులగణనలో సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. కులాల వారీగా జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడం, సముచిత విధాన నిర్ణయాలు అమలు చేసేందుకు కులగణన ప్రక్రియను ఈ నెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లాలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరికి సంబంధించిన వివరాలను కులాల వారీగా సేకరిస్తున్నారు. జిల్లాలోని 607 సచివాలయాల పరిధిలో ఉన్న 12,408 క్లస్టర్లలో ఇప్పటివరకు 49.85 శాతం సర్వే పూర్తయింది. మొత్తం 7,15,260 గృహాల్లో 21,47,507 జనాభా ఉన్నారు. గురువారం నాటికి 3,56,508 గృహాల్లో 8,66,633 మందికి సంబంధించిన సామాజికవర్గ వివరాలు సేకరించారు.











వెయ్.. చిందెయ్..

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని బాస్కెట్ బాల్ మైదానంలో గురువారం సందడి నెలకొంది. నిత్యం పుస్తకాలతో, ల్యాబ్‌ల్లో గడిపే విద్యార్థులంతా ఒక్క చోటకు చేరి ఆడి పాడారు. కళాశాల కల్చరల్ క్లబ్ 'ఏయూ యునైటెడ్' ఆధ్వర్యంలో 'బంధాలను బలోపేతం చేయడం' అనే నినాదంతో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు శాస్త్రీయ నృత్యాలతో ఆరంభించి, పాపులర్ సినిమా పాటలకు అనుగుణంగా డ్యాన్స్‌లతో అలరించారు. ఇదే వేదికపై విద్యార్థులు పలు సినీ గీతాలను ఆలపించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ సాంస్కృతిక ఉత్సవం యువతలోని ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచింది. వందలాది మంది విద్యార్థులు ఫ్లాష్‌మాబ్‌ను తిలకించడానికి విచ్చేశారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థి కిల్లాన హేమంత్ కుమార్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఏయూ యునైటెడ్ అధ్యక్షుడు కోన హేమంత్, విద్యార్థులు సాయికృష్ణ, శేషు, వరుణ్, చతుర్వేది మనీష, నిత్య, చందన, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ.. కబడ్డీ

ఏయూ క్యాంపస్: యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గురువారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పురుషుల ఖోఖో, కబడ్డీ, బాలికల ఖోఖో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. యువత ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తి ప్రదర్శించారు.


కబడ్డీ ఆడుతున్న యువత


ఖోఖో పోటీల్లో యువకుడి విన్యాసం


బాలికల ఖోఖో పోటీల విజేత జట్టుతో అధికారులు

విశాఖను గ్రీన్ సిటీగా అభివృద్ధి చేద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: విశాఖ మహా నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచ బ్యాంకుకు సంబంధించిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ) ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ బృందం సభ్యులు గురువారం కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధి కెల్విన్ బృంద సభ్యులు మూడు రోజులుగా జీవీఎంసీకి చెందిన పలు ప్రాంతాలను సందర్శించారని తెలిపారు. ముందుగా మేయర్ హరి వెంకటకుమారితో సమావేశమైనట్లు చెప్పారు. నగరంలో పచ్చదనం పెంపొందించడానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం -2024 నాటికి ఓ నివేదిక అందజేయాలని ఐఎఫ్‌సీ బృందానికి మేయర్ సూచించారన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లను, ఎన్జీవోస్‌తో కలిసి వారు చర్చించారన్నారు. అలాగే జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలోని పలు విభాగాలకు సంబంధించి వారు సమావేశమైనట్లు చెప్పారు. అర్బన్ గ్రీన్ సోలార్, వేస్ట్ వాటర్ రీసైక్లింగ్ ప్రాజెక్ట్, ఈ వెహికల్స్ తదితర అంశాలపై చర్చలు జరిగాయన్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు టెర్రస్ గార్డెన్ పెంపకంపై అవగాహన, నేవీ సహకారంతో హెలికాప్టర్ ద్వారా సీడ్‌బాల్స్‌ను మైదానం, కొండల ప్రాంతాలపై చల్లడం, తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు కమిషనర్ వారికి తెలియజేశారు.


ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

విదేశీ యువకుడిపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు


ప్రతాప్


సాయి ప్రసాద్


బాబీకుమార్

పెదగంట్యాడ: యారాడ తీరంలో విదేశీ యువకునిపై దాడి చేసిన ముగ్గురు యువకులను న్యూపోర్టు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. న్యూపోర్టు సీఐ యర్రంనాయుడు తెలిపిన వివరాల మేరకు.. మల్కాపురం ప్రాంతం శ్రీహరిపురానికి చెందిన అంకం బాబీకుమార్ (19), జనతా కాలనీకి చెందిన స్టైవన్ సాయిప్రసాద్ (20), ఇందిరా కాలనీకి చెందిన బాలసారి ప్రతాప్ (20)ను అరెస్టు చేశారు. స్విట్జర్లాండ్‌కు చెందిన నోహ ఎల్లియాస్‌పై వీరు ముగ్గురూ దాడి చేసి అతని సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న న్యూపోర్టు లా అండర్ ఆర్డర్ సీఐ జి.శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రసాద్, శ్రీనివాస్ బృందాలుగా విడిపోయి దాడి చేసిన ముగ్గురిని 12 గంటల వ్యవధిలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను సీపీ రవిశంకర్ అభినందించారు.

12న సాయ్ వాలీబాల్ ఎంపికలు

విశాఖ స్పోర్ట్స్: భారత క్రీడా సంస్థ స్పోర్ట్స్ ట్రెనింగ్ సెంటర్‌లో వాలీబాల్‌లో రెసిడెన్షియల్ శిక్షణ నిచ్చేందుకు బాలికల ఎంపికలు ఫిబ్రవరి 12,13వ తేదీల్లో జరగనున్నాయి. పోర్ట్‌స్టేడియంలోని ఎస్టీసీలో ఈ ఎంపికలు జరగనున్నాయని సాయ్‌ఎస్టీసీ సహాయ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 165 నుంచి 175 సెంటీమీటర్ల ఎత్తు గల 12 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలు 12వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభం అవుతాయన్నారు. మరిన్ని వివరాలకు 7046370324 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

80 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖ నగరానికి కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని పెందుర్తి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జి.మాడుగులకు చెందిన మంజీరు వెంకటరమణ, పాడేరుకు చెందిన మజ్జి చిన్నబ్బాయి ఏజెన్సీ ప్రాంతం నుంచి స్విఫ్ట్ కారులో 80 కిలోల గంజాయిని నగరానికి తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచా రం అందుకున్న సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెందుర్తి పోలీసులు సరిపల్లి వద్ద కాపు కాసి కారును తనిఖీ చేశారు. అందులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని తహసీల్దార్ శ్యాంప్రసాద్ ముందు ఉంచారు. ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పెందుర్తి ఎస్‌ఐ అశిరితాత, హెచ్‌సీలు సత్యనారాయణ, కృష్ణ, పీసీ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

బజాజ్ త్రీ వీలర్ షోరూం, వర్క్‌షాప్ ప్రారంభం


వినియోగదారుడికి ఎలక్ట్రిక్ ఆటో తాళం అందిస్తున్న సిబ్బంది

మద్దిపాలెం: మురళీనగర్‌లో ఆధునిక హంగులతో సరికొత్త బజాజ్ త్రీ వీలర్ షోరూం, వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జి.సి.రాజారత్నం జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిశోర్ మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో.. ఆధునిక హంగులతో.. బజాజ్ త్రీ వీలర్ షోరూం, వర్క్‌షాపును మురళీనగర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సరికొత్త మాక్సిమా ఎక్స్‌ఎల్ కార్గో ఇ-టెక్ 9.0, ఎక్స్‌ఎల్ కార్గో ఇ-టెక్ 12.0 ఎలక్ట్రిక్ త్రీవీలర్‌లను ఆవిష్కరించారు. ఈ ఎలక్ట్రిక్ ఆటోల్లో ఐపీ67 రేటెడ్ అడ్వాన్స్‌డ్ లై అయాన్ బ్యాటరీ, టూస్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, అత్యంత సమర్థవంతమైన పీఎంఎస్ మోటార్‌లను అమర్చినట్లు వెల్లడించారు. 11.8 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 149, 183 కిలోమీటర్ల రేంజ్ మైలేజ్ ఇస్తాయన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.3,58,456 నుంచి రూ.3,97,833గా నిర్ణయించినట్లు తెలిపారు. బజాజ్ ఆటో లిమిటెడ్ ఐబీయూ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ రాథోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల తొలగింపు

మరో 28 మందికి నోటీసులు

గాజువాక: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఏడుగురిని విధుల నుంచి తొలగిస్తున్నారు. మెడికల్ అన్‌ఫిట్ కారణాల వలన వారిని తొలగించినట్లు సమాచారం. వీరిలో నలుగురు అధికారులకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయగా, అన్‌ఫిట్‌కు సుముఖంగా ఉన్న ముగ్గురు కార్మికుల తొలగింపునకు సన్నాహాలు పూర్తి చేశారు. వీరితో పాటు మరో 28 మందికి మెడికల్ అన్‌ఫిట్ కారణాలతో తొలగింపు కోసం నోటీసులు జారీ చేశారు. బుధవారం జారీ చేసిన ఉత్తర్వులను గురువారం ఉద్యోగులకు విడుదల చేశారు. వీరికి 30 రోజులు పాటు గడువు ఇచ్చారు. అధికారుల సీడీఏ రూల్స్, కార్మికుల స్టాండింగ్ ఆర్డర్స్ అమలు చేయాలని ఉక్కు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు ఉక్కు యాజమాన్యం ఈ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. నోటీసులు అందుకున్న 28 మంది కార్మికుల్లో కొంతమంది సుముఖంగా ఉండగా, మరి కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు కార్మికవర్గాల సమాచారం.

ల్యాప్‌టాప్ దొంగల ముఠా అరెస్ట్

తాటిచెట్లపాలెం: రైళ్లు, రైల్వేస్టేషన్లలో మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను దొంగలించే ముఠాను గురువారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలివీ.. విశ్వసనీయ సమాచారం మేరకు.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ బి.అప్పలనాయుడు సిబ్బందితో రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అజయ్‌కుమార్ (23), చిన్న అప్పలనాయుడు (20), రాహుల్(19)లను విచారించి.. రైళ్లలో దొంగతనాలకు పాల్పడే ముఠాగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. వారి వద్ద ఆరు ల్యాప్‌టాప్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.